కరపత్రం

# స్థానిక గ్రామాల సాగునీటి అవసరాలు తీరిన తరువాతే
# ప్రాణహిత ప్రాజెక్టు చేపట్టాలి

తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలలో ఆదిలాబాద్ జిల్లాకు కూడా స్థానం ఉన్నది. ఆదిలాబాద్ జిల్లాను ఆనుకొని ప్రాణహిత నది పారుతున్నా స్థానిక ఆదివాసీ ప్రజానీకానికి సాగునీటిని అందించాలన్న 'సోయి' రాష్ట్రాన్ని ఇప్పటి వరకు ఏలిన ఏ ప్రభుత్వానికీ లేదు.

'ప్రజాప్రస్థానం' పేరుతో గ్రామగ్రామానికి కాలినడకన వచ్చి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూసి పరిష్కరిస్తానన్న వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన రాజశేఖర్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ రైతులకు సాగు, తాగు నీరు అందించే విధంగా ఏ ప్రాజెక్టు చేపట్టలేదు సరికదా ఇక్కడి గ్రామాలను ముంచి, ఇక్కడి నీరు కొల్లగొట్టుకుపోయే విధ్వంస ప్రణాళికను మాత్రం సిద్ధం చేశాడు. ఆ ప్రణాళిక రూపమే 'ప్రాణహిత-చేవెళ్ళ ఎత్తిపోతల ప్రాజెక్టు'. దానికి పునాది రాళ్ళు కూడా వేశాడు.

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భారీ ప్రాజెక్టులలో ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు ఒకటి. ఇది జలయజ్ఞానికే తలమానికమని ప్రభుత్వం చెప్పుకుంటున్నది. వార్ధా, పెన్ గంగా నదులు కలిసి కౌటాల మండలం తమ్మిడిహేటి గ్రామం వద్ద ప్రాణహితగా మారుతున్న చోట ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారు. ఇక్కడ లభిస్తున్న 305 టియంసిల నీటిలో 160 టియంసిల నీటిని వినియోగించుకొని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, వరంగల్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు విస్తారంగా సాగునీటిని, తాగునీటిని ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. ఇందుకోసం 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని, నిర్వహణ కోసం 3375 మెగావాట్ల కరెంటును వినియోగిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. నీళ్ళు ఇవ్వాలన్న ప్రభుత్వం ఉద్దేశ్యంపట్ల మాకు అభ్యంతరం లేదు. కానీ ఇక్కడి నుండి పోతున్న నీటిలో స్థానికుల సాగునీటి అవసరాలను ఏ మాత్రం తీరుస్తున్నారు అన్నది మా ప్రశ్న.

దూర ప్రాంతాలకు నీళ్ళు తీసుకుపోయి సంతర్పణ చేస్తున్న ఈ ప్రాజెక్టు నది దాపున ఉన్న గ్రామాలకు మాత్రం చుక్క నీరు కూడా ఇవ్వడం లేదు. తమ్మిడిహేటి నుండి ప్రాజెక్టు కాలువ

కర్జెల్లి, బారెగూడ, సలుగుపల్లి, సులుగుపల్లి దాటి చెన్నూర్‌లో ప్రవేశించిన తరువాతే స్థానిక ప్రజలకు కొద్దిపాటి నీరు ఇస్తుంది. ఎల్లంపల్లి దాటిన తరువాతనే చెప్పుకోదగ్గ ఆయకట్టు మొదలవుతుంది. ఇదెక్కడి అన్యాయం అని స్థానిక ప్రజలు అడుగుతున్న ప్రశ్నకు ప్రభుత్వం నుండి ఏ జవాబు లేదు. డిసెంబర్ 16వ తేదీన ఇక్కడ శంకుస్థాపన చేయడానికి వచ్చిన ముఖ్యమంత్రిని నిలదీయడానికి స్థానిక ప్రజలు సమాయత్తం కాగా, వారి నాయకులను అరెస్టు చేసి శంకుస్థాపన కానిచ్చేశారు.

ఇది సస్యశ్యామలమైన ప్రాంతం అయివుంటే ప్రభుత్వ వైఖరిని అర్థం చేసుకొని ఉండవచ్చు. కానీ ప్రాణహిత నది దాపున ఉన్న కౌటాల, బెజ్జూరు, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల గ్రామాలు వర్షాధారంగా ఒక పంట పండించుకొని బతికే గ్రామాలు. ఆకాశ తరిగా సోయాబీన్స్, కందులు, పెసలు పండించుకొని ఆ తరువాత ఎక్కడయినా పని దొరికితే చేసుకొని, దొరకకపోతే పస్తులుండే ఊర్లు. చాలాకాలంగా ప్రజలు ప్రాణహిత మీద ఆశలు పెట్టుకున్నారు. నాయకులు హామీలిచ్చారు. ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు ప్రతిపాదన గురించి విన్న నాటి నుండి తమ సాగునీటి అవసరాలు తీరుతాయని అనుకున్నారు. తమ నాలుగు మండలాల సాగు భూములకు ఎంత నీరు కావాలి? 10 లేక 15 టిఎంసిలు కేటాయించకపోతారా అని భావించారు. ప్రభుత్వ అధికారులు, సిర్పూర్ ఎమ్మెల్యే కూడా అదే అభిప్రాయం కలిగించారు.

కానీ నవంబర్ 19 నాడు చేవెళ్ళలో ముఖ్యమంత్రి మొదటి శంకుస్థాపన చేసినప్పుడు పత్రికలలో ప్రచురించిన ప్రకటన ఆ ఆశలన్నీ అడియాసలేనని రుజువు చేసింది. ప్రాజెక్టు మొదలయిన చోటు నుండి 25 కిలోమీటర్ల వరకు ఈ కాలువ ఒక్క చుక్క నీళ్ళియ్యదని ఆ ప్రకటన జత చేసిన పటం తెలుపుతుంది. అప్పటినుండి స్థానిక ప్రజలలో ఆందోళన మొదలయింది. దానిని అరెస్టులతో చల్లార్చి తన పని కానిచ్చుకొని పోదామని ప్రభుత్వం చూస్తున్నది.

ప్రాజెక్టు ఫలితం స్థానికులకు దక్కదు గానీ నష్టమంతా వారికే. కాలువ కోసం 300 మీటర్ల వెడల్పు భూమిని, దాని ఒడ్డుకోసం మరింత భూమిని కాలువ మార్గం వెంబడి ప్రభుత్వం సేకరిస్తున్నది. స్థానిక ప్రజలకు ఉన్న వనరులు, ఉన్న జీవనాధారం లేకుండా చేసి దూరప్రాంతాలకు నీళ్లివ్వడం ఏరకమైన పాలనా నీతి?

నిజానికి అధికారులు ఈ గ్రామాల ప్రజలకు ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు గురించి గానీ దాని రూపురేఖల గురించి గానీ ఏరోజూ ఏమీ చెప్పలేదు. ఏ సమాచారం ఇవ్వలేదు. సర్వే సిబ్బంది వస్తారు. ఏమీ చెప్పకుండా సర్వే చేసుకుంటారు. ప్రజలు అభ్యంతరం తెలిపితే 'దౌర్జన్యం' చేసారంటారు. ప్రజలకు కనీసం సమాచారం ఇవ్వకుండా వారి జీవన వనరులను, వారికి అందుబాట్లో ఉన్న నీటి వనరులను వారికి కాకుండా చేయడం 'దౌర్జన్యం' అనిపించుకోదా? కాలువ కింద ఎంత భూమి పోతుంది? అందులో పట్టా భూమి ఎంత? లావణీ ఎంత, బంజరు ఎంత, అడవి ఎంత? భూమి కోల్పోయిన వారికి ప్రభుత్వం వేరే ఎక్కడయినా భూమినిస్తుందా? కూలి చేసుకొని బతికే పేదలకు వేరే ఎక్కడయినా ఉపాధి కల్పిస్తుందా? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పకుండా ప్రాజెక్టు పనులు చేసుకుంటూ పోవడం, ప్రజలను చీకట్లో ఉంచడం, ప్రజాస్వామ్య పాలన అనిపించుకుంటుందా?

ప్రాజెక్టు వల్ల కలిగే ఫలాలను స్థానికేతరులు అనుభవిస్తూ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన స్థానిక గిరిజన ప్రజలు మాత్రం నిర్వాసితులై సర్వం కోల్పోయి నిరాశ్రయులు కారాదు. బలమైన ప్రజా నిరసన

మాత్రమే నిర్వాసిత ప్రజలకు న్యాయం జరిగేటట్లు చేస్తుంది. కావున ప్రాణహిత పరీవాహక గ్రామాల సాగునీటి అవసరాలను తీర్చాలని డిమాండ్ చేస్తూ జరిగే ప్రజాచైతన్య యాత్రలో అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పక్షాలు, ప్రజాస్వామికవాదులు పాల్గొని మద్దతునివ్వవలసిందిగా కోరుతున్నాము.

## మా డిమాండ్లు

ప్రాణహిత నది నీటిలో కనీసం 25 టి.ఎం.సి.లు కౌటాల, బెజ్జూరు, దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూర్ మండలాల సాగునీటి, తాగునీటి అవసరాలకు కేటాయించాలి. దాని కోసం ఆచరణ యోగ్యమైన ప్రాజెక్టు ప్రణాళికను రూపొందించాలి.

ఆదిలాబాద్ జిల్లా కలెక్టరు, నీటిపారుదల శాఖ అధికారులు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోయే అన్ని గ్రామాలలోను గ్రామ సభలకు హాజరయి ప్రాజెక్టు తీరుతెన్నుల గురించి, సేకరించబోయే భూముల గురించి, నష్టపరిహారం పునరావాసాల గురించి వివరంగా ప్రజలకు చెప్పి ప్రజల అభిప్రాయాలు వినాలి.

పై రెండూ జరిగేదాకా ప్రాణహిత-చేవెళ్ల పనులు చేపట్టకూడదు.

ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల శాఖలు, 24-1-2009